# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 13-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాయలసీమ గొప్ప సంస్కృతికి, ఖనిజ వనరులకు నిలయమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రి వర్గం పలు అంశాలపై చర్చిస్తోంది.**
3. **రాజధాని అమరావతిని అన్ని ప్రాంతాలతో అనుసంధించేలా చర్యలు తీసుకుంటున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**
4. **తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు.**
5. **తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ సహాయమంత్రి ఎల్.మురుగన్ ఈరోజు దర్శించుకున్నారు.**

==========================

రాయలసీమ గొప్ప సంస్కృతికి, ఖనిజ వనరులకు నిలయమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు వైఎస్ఆర్ కడప జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, యోగి వేమన పద్యాలు నీతిని, సాంఘిక చైతన్యాన్ని బోధిస్తాయన్నారు.సామాన్యులకు సైతం అర్థమయ్యేలా జీవన సత్యాలను, నైతిక విలువలను వేమన పద్యాల రూపంలో మనకు అందించారని గవర్నర్ పేర్కొంటూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తో పాటు రాష్ట్ర మంత్రులు, ఇతర అధికారులు హాజరయ్యారు. మంత్రి వర్గ సమావేశంలో భాగంగా ఇటీవల సీఆర్డీఏ అథారిటీ తీసుకున్న నిర్ణయాలకు, పలు సంస్థలకు కార్యాలయ నిర్మాణానికి భూమి కేటాయింపులు, అమరావతి నిర్మాణ పనులకు పరిపాలనా అనుమతుల వంటి అంశాలపై

చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

ఒక్కరోజులో 6,160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో రికార్డు నమోదు చేసిన ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ - APGENCOకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈ రోజు స్పందిస్తూ, జెన్కో ప్రాజెక్టుల గరిష్ట సామర్థ్యం 6,610 మెగావాట్లు కాగా.... ఈ నెల 11వ తేదీన 6,160 మెగావాట్ల తో 93.19 శాతం ఉత్పత్తిని చేరుకోవడం గొప్ప విషయమని అన్నారు. ఈ ఘనత సాధించడంలో భాగస్వాములైన కార్మికులకు, ఉద్యోగులకు, ఉన్నతాధికారులకు, సంబంధిత శాఖా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర విద్యుత్ రంగం రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను సాధించి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

---------------------------

రాజధాని అమరావతిని అన్ని ప్రాంతాలతో అనుసంధించేలా చర్యలు తీసుకుంటున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లి వద్ద బకింగ్ హామ్ కాలువ పై చేపట్టిన వంతెన నిర్మాణ పనులను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీడ్ యాక్సిస్ రహదారిని మంగళగిరికి అనుసంధానించేందుకు భూసేకరణ చేపడుతున్నామని చెప్పారు. గుంటూరు ఛానల్, కొండవీటి వాగులపై 2 వంతెనలను నిర్మించనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 22 సెకన్లు

---------------------------

2025 సంవత్సరంలో ప్రకృతి విపత్తులతో ప్రభావితమైన రాష్ట్రాలకు అదనపు సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఢిల్లీలో సమావేశమైన ఉన్నత స్థాయి కమిటీ ఈ మేరకు ఆయా రాష్ట్రాలకు జాతీయ విపత్తు స్పందన నిధి కింద మొత్తం 1,912 కోట్ల 99 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 341 కోట్ల 48 లక్షల రూపాయలు, ఛత్తీస్‌గఢ్‌కు 15 కోట్ల 70 లక్షలు, గుజరాత్‌కు 778 కోట్ల 67 లక్షలు, హిమాచల్ ప్రదేశ్‌కు 288 కోట్ల 39 లక్షలు, నాగాలాండ్‌కు 158 కోట్ల 41 లక్షలు, అలాగే కేంద్రపాలిత జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి 330 కోట్ల 34 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఇవి రాష్ట్రాలకు ఇప్పటికే రాష్ట్ర విపత్తు స్పందన నిధి ద్వారా ఇచ్చిన సహాయానికి అదనంగా మంజూరు చేసిన నిధులని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

---------------------------

రామాయణాన్ని సరళమైన తెలుగు లో మొల్ల రామాయణం పేరుతో రచించి తొలి తెలుగు కవయిత్రిగా ఖ్యాతిగాంచిన ఆతుకూరి మొల్ల మాంబ జయంతిని ఈ రోజు నిర్వహిస్తున్నారు, మొల్ల జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర పండుగగా ఈ రోజు ఘనంగా నిర్వహిస్తున్నారు. మొల్ల జయంతి సందర్భంగా అమరావతి సచివాలయం లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో మొల్ల జయంతిని ఈ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మలోలా పాల్గొని మాట్లాడుతూ, మొల్ల జీవితం మహిళలందరికీ ఆదర్శమని అన్నారు. విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మొల్లమాంబ జయంతి వేడుకలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో

ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరగనున్న రాష్ట్ర స్థాయి జయంతి. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఈ మధ్యాహ్నం పాల్గొంటారు.

----------------------------

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఈ ఉదయం దర్శించుకున్నారు. ఆలయం వద్ద టిటిడి అధికారులు కేంద్రమంత్రికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయం వెలుపల కేంద్రమంత్రి మురుగన్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తున్నారని తెలిపారు. ప్రజలందరి ఆరోగ్యం, శ్రేయస్సు, దేశాభివృద్ధి కోసం స్వామి వారిని ప్రార్థించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

----------------------------

నంద్యాల జిల్లా శ్రీశైలం మహా క్షేత్రంలో ఈ నెల 16 నుంచి ఉగాది మహోత్సవాలు జరగనున్నాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, ఉగాది ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారని దీనికి అనుగుణంగా త్రాగునీరు, భోజన వసతులను ఏర్పాటు చేశామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 25 సెకన్లు

----------------------------

యువతలోని నైపుణ్యాలను,ఆలోచనలను ప్రదర్శించడానికి కేంద్ర ప్రభుత్వం మేరా యువ భారత్ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలులోని స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో నిన్న నిర్వహించిన “వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్” లో జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని అక్షయ ఆకాశవాణితో మాట్లాడుతూ,

వాయిస్ 23 సెకన్లు

----------------------------

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు జిల్లా నేలపాడు హైకోర్టు హాలులో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ స్థానంలో జస్టిస్ లిసా గిల్ప్రధాన న్యాయమూర్తి గా నియమితులు కానున్నారు.

----------------------------

కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలో “సామాజిక అధికారిత శివిర్” పేరుతో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని ఈరోజు నిర్వహించారు. శ్రీకాళహస్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ తిరుపతి జిల్లా సహాయ సంచాలకులు వినోద్ పాల్గొని ప్రత్యేక ప్రతిభావంతులకు, దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సహాయక పరికరాలను పంపిణీ చేశారు.

=====================